



# V న్యూస్

తెలుగు దినపత్రిక

మన ఊరు - మన వార్తలు

Postal Reg.No. MPM/L22/VNEWS/19-21






సంపుటి 9 | సంచిక214 | మచిలీపట్నం విజయవాడ కాకినాడ గుంటూరు ఖమ్మం వైఎస్ఆర్‌కడప ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు | 9-1-2023 | సోమవారం | పేజీలు 4 | వెల.రూ 3/-






# జగన్‌ది నిరంకుశ పాలన

## ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమవ్వాలి

## - విలేకరుల సమావేశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్

దరాబాద్ బ్యూరో :ఆంధ్రప్రదేశ్‌లో జగన్ నిరంకుశ పాలన సాగిస్తున్నారని ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమవ్వాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలను అణచివేసేందుకు తీసుకొచ్చిన జిఒ నంబర్-1ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఐక్యపోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదనే ఉద్దేశంతోనే బ్రిటీష్ కాలంనాటి చీకటి జిఒను ఇప్పుడు తీసుకొచ్చారని వారు విమర్శించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఆయనతో సమావేశమయ్యారు. సుమారు రెండు గంటల పాటు వీరిద్దరి భేటీ కొనసాగింది. అనంతరం చంద్రబాబు, పవన్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. కందుకూరు, గుంటూరుల్లో జరిగిన ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులే కారణమని చంద్రబాబు ఆరోపించారు. ఎమర్జెన్సీ కంటే భయంకరమైన పరిస్థితి ఎపిలో ఉందని విమర్శించారు. ఎంత భయపెట్టినా మా మనోనిబ్బరాన్ని దెబ్బతీయలేరని అన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలపై ఎలా పోరాడాలనే దానిపైనే పవన్ కల్యాణ్‌తో చర్చించినట్లు చంద్రబాబు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయ పార్టీలు సజావుగా



కార్యకలాపాలు సాగించగలిగితే ఆ తర్వాత ఎన్నికలు, పొత్తులపై మాట్లాడొచ్చని చెప్పారు. 'విశాఖలో ఆంక్షలు పేరుతో పవన్ కల్యాణ్‌ను హింసించారు. ఇప్పటంలో అక్కడి ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లినా అలాగే చేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తే టిడిపి ఆఫీసుపై దాడి జరిగినా పోలీసులు స్పందించలేదు. నా సొంత నియోజకవర్గం కుప్పం వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.' అని అన్నారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలపై అవసరమైతే కేంద్రానికి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పవన్‌కల్యాణ్‌పై వైసిపి నేతల ఆరోపణలపై మీడియా పదేపదే వివరణ కోరగా చంద్రబాబు ఒకింత అసహనానికి గురయాయరు. అప్రజాస్వామ్య విధానాలను ప్రశ్నించే బాధ్యత మీకు లేదా? అంటూ విలేకరులను ఎదురు ప్రశ్నించారు. మీడియాను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ 2930 తీసుకొస్తే ఒక్క జర్నలిస్టు కూడా ప్రశ్నించలేదని, మిమ్మల్ని మీరే కాపాడుకోలేకపోయారని అక్కడున్న విలేకరులనుద్దేశించి అన్నారు. అంతకుముందు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అరాచకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, శాంతిభద్రతలు తదితర అంశాలపై చర్చించామని తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లనీయకుండా ప్రతిపక్ష నేతలను నియంత్రించేందుకే చీకటి జిఒ తెచ్చారని విమర్శించారు. ప్రభుత్వ దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు అనుసరించాల్సిన అంశాలపై చర్చించామని తెలిపారు. 'శాంతి భద్రతల పర్యవేక్షణ పోలీసుల బాధ్యత కాదా? మా సమావేశాలకు మా లాఠీలు మేమే పట్టుకోవాలా? అలాంటప్పుడు ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థదేనికి?' అంటూ ప్రశ్నించారు. వైసిపి నేతల విమర్శలన్నింటికీ ఈ నెల 12న జరిగే యూత్ మీటింగ్‌లో సమాధానమిస్తానన్నారు. ఎపిలో బిఆర్ఎస్ ప్రవేశంపై స్పందిస్తూ, తెలంగాణవాదం వదిలేసి వస్తున్నారు కనుక తప్పులేదన్నారు. ఏ పార్టీలోకి అయినా చేరికలు సహజమని, ఏ పార్టీ ఎక్కడైన పోటీ చేయవచ్చని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.






# సంక్రాంతికి 'రెట్టింపు' దోపిడీ

**ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో అధికంగా ఛార్జీల వసూళ్లు-ఏసీలో రూ.800-1,000, నాన్ ఏసీలో రూ.500-700 అదనం-అయినా పట్టించుకోని రవాణాశాఖ**



అమరావతి: సంక్రాంతికి సొంతూరికి వెళ్లేందుకు టికెట్లు రిజర్వు చేసుకుంటున్న ప్రయాణికులను పలు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు నిలువు దోపిడీ చేస్తున్నాయి. నిత్యం వసూలు చేసే ఛార్జీలను ఒకేసారి రెట్టింపు చేసి వారి జేబులు గుల్ల చేస్తున్నాయి. ఏసీ, నాన్ ఏసీ, సీటింగ్, స్లీపర్ అనే తేడా లేకుండా అన్నింటిలోనూ ఛార్జీలను పెద్ద ఎత్తున పెంచేశాయి. ఈనెల 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ నేపథ్యంలో ఎక్కువ మంది 11, 12, 13 తేదీల్లో ప్రయాణాలకు సిద్ధమయ్యారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు అప్పుడే మొదలవుతుండటంతో సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. నిత్యం తిరిగే రైళ్లు, పండగ ప్రత్యేక రైళ్లలో నిరీక్షణ జాబితా భారీగా ఉంది. బస్సుల్లోనే ఊళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిని అదనుగా తీసుకుని ఆయా ట్రావెల్స్ సంస్థలు బస్సు ఛార్జీలను పెంచేశాయి. విజయవాడ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులపై 'ప్రత్యేకంగా' బాదుతున్నాయి. దీనిపై అధికార యంత్రాంగం పర్యవేక్షణ పూర్తిగా కరవైందన్న విమర్శలు వినవస్తున్నాయి. పండగకు కోస్తా జిల్లాల్లోని సొంతూళ్లకు వెళ్లేవాళ్లు ఎక్కువగా ఉండటంతో అటు వైపు వెళ్లే బస్సుల్లో ఛార్జీలు అత్యధికంగా ఉన్నాయి. సాధారణ ఛార్జీల కంటే ఏసీ స్లీపర్‌లో ఒక్కో బెర్తుకు రూ.800-1000, ఏసీ సీటర్‌లో రూ.700-800, నాన్ ఏసీ స్లీపర్‌లో రూ.800 వరకు, నాన్ ఏసీ సీటర్‌కు రూ.600-800 చొప్పున పెంచేశాయి. తక్కువ సీట్లు, బెర్తులు ఉన్నాయని, త్వరగా బుక్ చేసుకోకపోతే అవీ అయిపోతాయని ప్రయాణికులకు చెబుతున్నాయి. విజయవాడ నుంచి విశాఖపట్నానికి ఆర్టీసీ ఏసీ ఇంద్ర సర్వీసులో వెళ్లాలంటే రూ.900, డాల్ఫిన్ క్రూయిజ్‌లో రూ.1,100, వెన్నెలలో (స్లీపర్) రూ.1270గా ఛార్జీ ఉంది. అదే ప్రైవేటు ట్రావెల్స్ నాన్ ఏసీ సీటర్‌లో రూ.1,600-1700, స్లీపర్‌లో రూ.1,800-2,000 వరకు వసూళ్లు చేస్తున్నాయి. అంటే నలుగురు సభ్యులున్న ఓ కుటుంబం విజయవాడ నుంచి విశాఖకు ఏసీ స్లీపర్‌లో వెళ్లాలంటే ఛార్జీలకు రూ.7,000-8,000 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. పండగవేళ పెంచిన ఛార్జీలను.. ట్రావెల్స్ సంస్థలన్నీ దర్జాగా ఆన్‌లైన్‌లోనే చూపిస్తున్నాయి. నిర్దేశిత ధరల కంటే ఇష్టారాజ్యంగా ఛార్జీలు పెంచేసినా రవాణాశాఖ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

# రాష్ట్రం గజ.. గజ

**చింతపల్లిలో కనిష్ఠంగా 1.5 డిగ్రీలు-ఉత్తరాంధ్రలోని చాలాచోట్ల 10 డిగ్రీలలోపే**

**ఉదయం 10 గంటలకూ వీడని మంచు**



అమరావతి: రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 1.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపే ఉంటున్నాయి. దక్షిణ కోస్తా, రాయలసీమల్లోనూ 10 నుంచి 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ఏలూరు, కర్నూలు, గుంటూరు, నంద్యాల తదితర జిల్లాల్లో 10 డిగ్రీల నుంచి 13 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రకాశం, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో పలుచోట్ల 15 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రతలు చాలాచోట్ల గణనీయంగా పడిపోయాయి. రాత్రి 8 గంటల నుంచే చలి గాలులు మొదలవుతున్నాయి. ఉదయం 10 గంటలకూ పొగ మంచు వీడటం లేదు. ఆదివారం ఉదయం 8.30 గంటల తర్వాత ఉత్తరాంధ్రలో పలుచోట్ల 7 డిగ్రీల నుంచి 8 **తరువాయి 2లో**











# రాహుల్ జోడోయాత్రపై ప్రశాంత్ కిషోర్ చురకలు



%పాట్నా : "వారంతా పెద్దవారు .. కిలో మీటర్ల మేర పాదయాత్ర చేపడతారు" అంటూ రాహుల్‌గాంధీ 'భారత్ జోడో యాత్ర' పై ఎన్నికల వ్యూహకర్త నుండి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ వ్యగ్యంగా విమర్శించారు. తన సొంతరాష్ట్రమైన బీహార్‌లో ప్రశాంత్ కిషోర్ జన్ సురాజ్ పేరుతో పాదయాత్ర చేపడుతున్న సంగతి తెలిసిందే. రాహుల్ జోడో యాత్రకు, మీ యాత్రకు సంబంధం ఉందా అని మోతిహరిలో శనివారం జర్నలిస్టులు ప్రశాంత్ కిషోర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. వారంతా పెద్దవారని, వారితో పోలిస్తే తానెంత అని అన్నారు. రాహుల్ గాంధీ 3,500 కి.మీ సుదీర్ఘ పాదయాత్ర చేపడుతున్నారని, కానీ తాను అక్టోబర్ నుండి విరామం **-తరువాయి 2లో**

# మొబైల్ చూస్తూ.. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసిన అభ్యర్థి

అమరావతి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 92 పోస్టుల భర్తీకోసం ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రాథమిక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 18 జిల్లాల్లో 297 పరీక్షా కేంద్రాలను ఏపీపీఎస్సీ ఏర్పాటు చేసింది. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించారు. విజయవాడ బెంజి సర్కిల్‌లోని నారాయణ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో కాపీయింగ్ వెలుగు చూసింది. ఉదయం నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు పోరంకి సచివాలయంలో పనిచేస్తున్న కొల్లూరు వెంకటేశ్ అనే అభ్యర్థి ఏకంగా మొబైల్ తీసుకొచ్చాడు. మొబైల్‌లో గూగుల్ ఓపెన్ చేసి జవాబులు చూసి రాస్తుండగా అధికారులు గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్న



పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ఈసారి పేపర్-1 పరీక్ష తీరుపై అభ్యర్థుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. పలు ప్రశ్నలు ఎక్కువ నిడివితో ఇచ్చారని, చదవి అర్థం చేసుకునేందుకే ఎక్కువ సమయం పట్టిందని అభ్యర్థులు తెలిపారు. ప్రశ్నకు సమాధానం కొందరు అభ్యర్థులు మాత్రం.. ఉద్యోగార్థుల సత్తా పరీక్షించేందుకే ఎక్కువ నిడివిగల ప్రశ్నలు ఇచ్చారని తెలిపారు. గ్రూప్-1 ఉద్యోగాలకు మొత్తం 1,26,449 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

# కరెన్సీ నోట్లపై రాస్తే చెల్లుబాటు కావా..? క్లారిటీ ఇచ్చిన ప్రభుత్వం

దిల్లీ: సామాజిక మాధ్యమాల్లో (రకరకాల వార్తలు పుట్టుకొస్తుంటాయి. ఆ వార్తలు బ్యాంకు లావాదేవీలు, కరెన్సీ నోట్లకు సంబంధించినవైతే చాలా మంది ఇంకా ఆసక్తిగా చూస్తారు. వాటినే నిజాలని నమ్మే సిన వారెందరో. ఈ మధ్య కాలంలో కరెన్సీ నోట్లకు సంబంధించిన ఓ వార్త సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. రిజర్వ్ బ్యాంకు తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. నోట్లపై ఏవైనా రాతలు ఉంటే అవి చెల్లుబాటు కావని, అలా **-తరువాయి 2లో**






V న్యూస్
మన ఊరు - మన వార్తలు

## అప్రజాస్వామిక పోకడలు రాజకీయ సవాళ్లు

%కుప్పంలో చంద్రబాబు పర్యటనలో అడ్డుకోవడాన్ని ప్రతిపక్షాలు ఖండించాయి. రాజకీయ వివాదం నడిచినా, ఆయన యాత్రలూ ప్రసంగాలూ మామూలు కంటే అధికంగా ప్రచారంతో నడిచాయి. పోలీసుల వైఖరిపై ఆయన లేఖలు రాశారు. ఆయనపై పోలీసులు కేసులు పెట్టారు. వీటి తదుపరి మలుపులు చూడవలసివుంది గానీ మొత్తంమీద టిడిపికి కోరుకున్న ఫోకస్ రానే వచ్చింది. ఒక కార్మిక సంఘానికో అంగన్‌వాడీలకో ఇంత అనుకూలత అవకాశం వుండదు. ఇదే సమయంలో భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభకు వచ్చే ప్రతినిధులను కూడా ఆపేయడం, దింపేయడం ఇందుకు ఉదాహరణ. తెలుగుదేశం హయాంలోనూ ఇలాంటి అప్రజాస్వామిక ప్రతిబంధకాలు తీవ్రంగానే వుండేవి. మోడీ ప్రభుత్వం సంగతి చెప్పక్కరలేదు. తెలంగాణలోనూ యాత్రలను అడ్డుకోవడం వంటివి చూశాం. అందుకే హక్కుల రక్షణ అన్నది ఏ ఒక్కరికో లేక ఏ ఒక్క పార్టీకో సంబంధించిన సమస్య కాదు. సరికదా సామాన్య ప్రజానీకానికి మరింత ముఖ్యం. ఒక ధోరణిగా పాలక వర్గాలు దాడి చేస్తున్నప్పుడు ప్రజలు, ప్రజాతంత్రవాదులకు మరింత అప్రమత్తతా అవసరమవుతుంది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, ప్రతిపక్షాల నిరసన ఇప్పుడు జీవో నెంబర్1పై కేంద్రీకృతమై వున్నాయి. ఇటీవల కందుకూరు, గుంటూరులలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొన్న సభలూ సందర్భాలలో సంభవించిన మరణాలను కారణంగా చూపి జగన్ ప్రభుత్వం ఈ జీవో తీసుకొచ్చింది. ఆ విషాద ఘటనలు నిస్సందేహంగా చాలా బాధాకరమైనవి. ఆధ్వర్యం వహించిన తెలుగుదేశం, వారి నాయకులు, అభిమానులు తప్పక భద్రతా చర్యలు తీసుకోవలసింది. కనీసం రెండవ ఘటనైనా జరగకుండా చూడాల్సింది. అదే సందర్భంలో వరుసగా రెండవసారి కూడా ఇలాంటి తప్పు జరగడానికి పోలీసుల పాత్ర లేదా నిఘా లోపం తక్కువ కాదు. జరిగిన ఈ దుర్ఘటనలను సాకుగా చూపి రాష్ట్రంలో మరెక్కడా రోడ్‌షోలు జరగకూడదని నిర్ణీత ప్రదేశాల్లో, స్థలాల్లో అది కూడా పోలీసులు పూర్తి అనుమతినిచ్చిన తర్వాత మాత్రమే సభలు, సమీకరణలు జరుపుకోవాలని ఉత్తర్వునివ్వడం దారుణం. రోగమొకటైతే మందొకటి ఇచ్చిన చందం. చాలా కాలంగా ప్రజా ఉద్యమాలు కార్మిక ఉద్యోగ నిరసనలు, రాజకీయ పార్టీల పిలుపులు పర్యటనలు విఫలం చేయడానికి పోలీసులు గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేయడం సర్వసాధారణం అయిపోయింది. ముందుగానే వాటిని అడ్డుకుంటూ ప్రత్యేక ఉత్తర్వులు ఆంక్షలు, పొలిమేరల్లో అరెస్టు చేయడం జరిగిపోతున్నది. అంగన్‌వాడీలు, వివోఏలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ ఈ చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నవారే. ఇటీవలనే విశాఖపట్నంలో జనసేన అధినేత పర్యటన విషయంలోనూ అదే చూశాం. వామపక్ష నాయకులకు ఇది నిరంతర అనుభవమే. గతంలో తమ పాలనలో ఇదే విధానం అనుసరించిన తెలుగుదేశం ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటు న్నది. ఈ నేపథ్యంలో జీవో1 తీసుకొచ్చిన తర్వాత కదలికలపై ఆంక్షలు తప్పవని అన్ని ప్రతిపక్షాలూ భావిస్తున్నాయి. ఆందోళన చెందుతున్నాయి. నిజానికి ఈ విషాద ఘటనలను ముందు జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ అఖిలపక్ష సమావేశం నిర్బంధాలను, ఆంక్షలను అడ్డుకోవాలని పిలుపు నిచ్చింది. ఇంతలోనే టిడిపి సభల్లో ఈ మరణాలు సంభవించాయి. అలాంటివి జరగకుండా అడ్డుకోవాలనే పేరిట జీవో వెలువడింది. విషాదంపై విచారణ ఏదీ ?టిడిపి సభలలో నాలుగు రోజుల వ్యవధిలోనే రెండు తొక్కిసలాటలు జరిగాయి గనక ఆ పార్టీ నాయకత్వం ప్రధాన బాధ్యత కాదనలేనిది. కందుకూరులో ఇరుకైన స్థలంలో కటౌట్లు, ఫ్లెక్సీలు పెట్టి మరింత ఇరుకు చేయడం పక్కనే డ్రైనేజీ నుంచి భద్రత లేకపోవడం నిర్లక్ష్య ఫలితాలే. కానీ ఇరుకు రోడ్లలో సభలు పెట్టి వచ్చిన వారిని ఎక్కువచేసి చూపుతు న్నారని ఆరోపించే ప్రభుత్వం పోలీసులు ముందే ఎందుకు చర్య తీసుకోలేదనేది కూడా ప్రశ్నే. నాలుగు రోజులలో అదీ నూతన సంవత్సరాన గుంటూరు వంటి కేంద్రంలో దానధర్మాలతో కలగలిపి రాజకీయ సభ పెట్టినప్పుడు పోలీసులు మరింత జాగ్రత్త పాటించవ లసింది కదా? ఉయ్యూరు ఫౌండేషన్ పేరిట ఈ కార్యక్రమం జరిగినా టిడిపి ప్రత్యక్ష పాత్ర కనిపిస్తూనే వుంది. ఉచితాలపై నిరంతర చర్చ జరుగుతుండగా రాజకీయ సభలో దానాలు చేస్తామని టోకెన్లు ఇచ్చి మరీ రప్పించడం తీవ్రమైన విషయమే, వారికి కొద్ది సమయం ఇచ్చి ఆపేయడం మరింత తొక్కిసలాట ఎవరైనా వూహించగలరు. ఘటన జరిగిన తర్వాతనైనా పశ్చాత్తాపంకన్నా ఎదురు దాడి అధికంగా వుంది. టిడిపి కావాలనే ఇదంతా చేసిందని వైసీపీ అంటే, వైసీపీ వారే కుట్రతో ఇదంతా జరగడానికి కారకులైనారని టిడిపి తీవ్ర ఆరోపణ చేస్తున్నది. ఉభయులూ తమ ఆధారాలు చెప్పడం లేదు. రెండు ఘటనల నిర్వాహకులను అరెస్టు చేస్తే కోర్టు విడుదల చేసింది. ఇక్కడే సమస్య ఉత్పన్నమవుతుంది. సభలలో తొక్కిసలాటకు కారణమైన వారిపై దర్యాప్తు న్యాయపరమైన చర్య తీసుకోవడం జరగాలి. పోలీసులు ఎందుకు ఉపేక్ష వహించారా అన్నదీ చూడాల్సిందే. మొత్తంగా ఈ దుర్ఘటనల నుంచి రాజకీయ పార్టీలు, సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నది చర్చ జరిపి సూచనలు చేయొచ్చు. అవసరమైతే అఖిలపక్షం జరపొచ్చు. దానికి బదులు రోడ్ల పక్కన సభలే పెట్టరాదనీ, రోడ్ షోలు కుదరవనీ జీవో ఇవ్వడమేమిటి? ఎవరిది తప్పు ఎవరికి శిక్ష? రెండు చోట్ల జరిగిన ఘటనలకు ఇంకెక్కడా సభలే వద్దనడం ఏం ప్రజాస్వామ్యం?

# రాష్ట్రం గజ.. గజ

(మొదటి పేజీ తరువాయి)

డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం. అల్లూరి జి.మాడుగులలోనూ 1.5 డిగ్రీలు నమోదైంది. జీకే వీధిలో 2.2, గంపరాయి, డుంబ్రిగూడలలో 2.6, కొక్కిస 2.7, గొర్రెల మిట్టలో 2.8, పెదబయలులో 2.9, పాడేరులో 3.1, దలపటిగూడలో 3.3, ముంచంగిపుట్టులో 3.8, భీమసింగిలో 4.0 డిగ్రీలుగా నమోద య్యాయి. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస, సీతంపే ట, పాచిపెంట, సీతానగరం, సాలూరు, కురుపాం, మక్కువ, భామి ని, బలిజపేట, శ్రీకాకుళం జిల్లా సోంపేట, కొత్తూరు, పాతపట్నం, కవిటి, లావేరు, విజయనగరం జిల్లాలో బాడంగి, తెర్లాం, రామభద్రాపురం మండలాల్లో కనిష్ఠంగా 10 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లాలోనూ 13 డిగ్రీల లోపే ఉష్ణోగ్రత ఉంది13 డిగ్రీల లోపు నమోదైన మండలాలు ఏలూరు జిల్లా జీలు గుమిల్లి, జంగారెడ్డిగూడెం, నూజివీడు, దేవరాపల్లి, చింతలపూడి, బుట్టాయగూడెం, చాట్రాయి, కామవరపుకోట, ఆగిరిపల్లి ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు, వీరులపాడు, జి.కొండూరు, గంపలగూడెం, ఇబ్రహీంపట్నం, మైలవరం, విస్సన్నపేట, రెడ్డిగూడెం, పెనుగంచి పోలు, ఎ.కొండూరు, కంచికచర్ల, జగ్గయ్యపేట, వత్సవాయికర్నూలు జిల్లా ఆలూరు, కర్నూలు రూరల్, గూడూరు. పల్నాడు జిల్లా క్రోసూరు, దాచేపల్లి, బొల్లాపల్లి, వెల్దుర్తి, అచ్చంపేట బాపట్ల జిల్లా సంతమాగులూరు, అద్దంకిలంబసింగిలోనే అత్యల్పం ఎందుకంటేలంబసింగి సముద్ర మట్టానికి 3,600 అడుగుల ఎత్తులో ఉంది. చుట్టూ ఎత్తైన తూర్పు కనుమలు విస్తరించి ఉన్నాయి. లోతైన లోయలు, దట్టమైన అడవి, శీత గాలుల తీవ్రత, బొగ్గు పులుసు వాయువు తక్కువగా ఉండటంతో ఇక్కడ అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి.

మంచు ముసుగులో మన్యం సొగసు

పాడేరు,చింతపల్లి, జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లంబసింగి వద్ద ఆదివారం రికార్డు స్థాయిలో 1.5 డిగ్రీలు నమోదైంది. ఈ ప్రాంతానికి మరింత ఎత్తులో ఉన్న ప్రాంతంలో సున్నా నుంచి ఒక డిగ్రీ లోపే ఉష్ణోగ్రత నమోదైందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మన్యం అంతటా అతి శీతల వాతావరణం నెలకొంది. ఉదయం 10 గంటల వరకు లైట్ల వెలుతురులోనే వాహనాలు నడ పాల్సి వస్తోంది. లంబసింగి, వంజంగి ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు, చేతికందే ఎత్తులో మంచు మేఘాలు, సూర్యోదయ దృశ్యాలను చూడడానికి పర్యాటకులు పోటెత్తుతున్నారు.

## కరెన్సీ నోట్లపై రాస్తే చెల్లుబాటు కావా..? క్లారిటీ ఇచ్చిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

రాయడంచట్టరీత్యా నేరమని దాని సారాంశం. దీనికి మరింత బలాన్ని చేకూర్చేలా అమెరికాలోనూ ఇలాంటి చట్టం అమలవు తోందటూ వదంతులు పుట్టిస్తున్నారు. దీనిపై తాజాగా ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. అవన్నీ తప్పుడు వార్తలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్‌చెక్ తన ట్విటర్ ఖాతాలో పేర్కొంది. అయితే, కరెన్సీ నోట్లను శుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశంతో నోట్లపై ఎలాంటి రాతలు ఉండకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొంది. దీనివల్ల నోట్లు చూసేందుకు బాగుండవని, అంతేకాకుండా దాని జీవితకాలం తగ్గుతుందని పీఐబీ ట్విటర్‌లో తెలిపింది. నిజమేంటో తెలుసుకున్నారు కదూ.. అలాంటి వార్తలను నమ్మొద్దు సుమీ..! అలాగని వాటిపై ఎలాంటి రాతలు కూడా వద్దు.

## ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సహాయం



-గన్నవరం సాయం కోసం ఎదురు చూసే పేద వారికి నేనున్నా అంటూ వేలాది రూపాయలు సహాయం చేసి యువతుల భవితకు భరోసా కల్పిస్తున్న నేత ఎమ్మెల్యే వంశీ అని విజయవాడ ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామానికి చెందిన షేక్ గుల్జార్ ఇద్దరు కుమార్తెలు షేక్ పర్వీనా, షేక్ రహిమాలు ఎంబీఏ పూర్తి చేశారు. కర్వీన ఇబ్రహీంపట్నం మండలం లోని నిమ్రా కళాశాలలో చదివింది. రహిమా విజయవాడ కేబీఎన్ కళాశాలలో చదువుకుంది. చదువు పూర్తి చేసినా ఫీజులు పెండింగ్ పడడంతో సర్టిఫికెట్లు నిలుపుదల చేశారు. ఉద్యోగానికి వెళ్తే సర్టిఫికెట్లు అడుగుతున్న నేపథ్యంలో ఫీజులు కట్టేందుకు తండ్రి లేడు. దిక్కుతోచని పరిస్థితుల్లో ఆ గ్రామ సర్పంచ్ శీలం రంగారావు వద్దకు వెళ్లి వారి సమస్యలు చెప్పుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వంశీని కలిసి చెప్పగా వెంటనే ఆయన స్పందించి ఒక్కొక్కరికి రూ.30 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. గన్నవరం లోని పార్టీ కార్యాలయంలో కొమ్మా కోట్లు చేతుల మీదుగా సహాయం సొమ్మును వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో కోనేరు సుబ్బా రావు, రామిశెట్టి వెంకటేశ్వర రావు, ఎనికెపాడు సర్పంచ్, రాచమల్ల పూర్ణ చంద్రరావు, గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్ రాణి, బి.రాజేంద్ర ప్రసాద్, బొప్పన కృష్ణ, పైలా శ్రీను, చెన్ను కమల్ రాజ్, కైలె శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ జోడోయాత్రపై ప్రశాంత్ కిషోర్ చురకలు

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా యాత్ర చేపడుతున్నానని.. తనకు కిలో మీటర్లతో పట్టింపు లేదని అన్నారు. ఈ యాత్రకు తన శారీరక ధృడత్వాన్ని సాక్ష్యంగా చూపాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు. బీహార్‌లో రాజకీయ నాయకులు తనని అవకాశవాదిగా పేర్కొనడంపై స్పందిస్తూ..

తన యాత్ర ఉద్దేశం మాత్రం స్వచ్ఛమైందని తెలిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా విశ్రాంతి తీసుకోవడం, మధ్య మధ్యలో వాహనాలపై ప్రయాణించడానికి కూడా తాను ఇష్టపడనని పరోక్షంగా రాహుల్‌ను ఎద్దేవా చేశారు.

## నిరసనకారుల మద్దతుదారులపై ఇరాన్ ఉక్కుపాదం ..




టెహ్రాన్ : దేశంలో నిరసనలకు మద్దతిచ్చిన వారిపై ఇరాన్ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వం తమలో ఎవరినైనా అరెస్ట్ చేయవచ్చని ఇరాన్ జర్నలిస్టులు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితిని సోషల్‌మీడియా ద్వారా జర్నలిస్టులు ప్రపంచానికి తెలియజేయడానికి యత్నించడం అక్కడి పాలకులకు ఆగ్రహం కలిగిస్తోంది. దీంతో దేశంలో నిరసనలకు మద్దతు ఇచ్చే వారిని ఇరాన్ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని, జర్నలిస్టులను అరెస్ట్ చేయడం, వారి వ్యాసాలను మీడియా నుండి తొలగించడమే కాకుండా, హక్కుల ఉల్లంఘనలను ప్రపంచానికి వెల్లడించిన నిపుణులపై కూడా అణచివేత కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ''2023 జనవరి 1వ తేదీన జర్నలిస్టు మిలాద్ అలవిని అదుపులోకి తీసుకున్నారు. ఎందుకు అని నాకు కూడా తెలియదు'' అని మిలాద్ సోదరుడు ట్విటర్‌లో పోస్ట్ చేశారు. డిసెంబర్ 13న భద్రతా అధికారులు తమ అపార్ట్‌మెంట్‌లో సోదాలు చేసి, మిలాద్ ఫోన్ , ల్యాప్‌టాప్‌లను స్వాధీనంచేసుకున్నారని తెలిపారు.గతేడాది సెప్టెంబర్‌లో హిజాబ్ సరిగా ధరించలేదంటూ మోరాలిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న మాహ్సా అమ్ని కస్టడీలో మరణించిడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నిరసనల్లో పాల్గన్నవారిపై భద్రతా బలగాలు విరుచుకుపడుతున్నాయి. గత సెప్టెంబర్ నుండి ఇప్పటివరకు సుమారు 470 మంది ఆందోళనకారులను చంపబడ్డారని మానవహక్కుల నిపుణులు వెల్లడించారు. 18వేల మందికి పైగా అరెస్టయ్యారని అంచనా వేస్తున్నారు. ఆ నిరసనల్లో అరెస్టయిన బాధితులు, మరణించిన వారికుటుంబసభ్యుల కథనాలను మిలాద్ అలవి మీడియాలో పోస్టు చేసేవారు. దీంతో ఆయనను ఈ ఏడాది ప్రారంభంలో అదుపులోకి తీసుకుంది. సుమారు 62 మంది జర్నలిస్టులు ప్రస్తుతం జైలులో ఉన్నారని ఇరాన్ మానవ హక్కుల సంస్థ తెలిపింది. టెహ్రాన్ దినపత్రిక షార్గ్‌లో పనిచేస్తున్న మిలాద్ అలవి, సామాజిక వేత్త సయీద్ మదానీలు జైలులో ఉన్నట్లు తెలిపింది. ఇజ్రాయిల్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన ప్రముఖ రచయిత, చిత్రకారుడు మెహదీ బహ్మాన్‌కు ఇరాన్ కోర్టు మరణశిక్ష విధించింది. ఇరాన్, ఇజ్రాయిల్‌లమధ్య శాంతి స్థాపనకు సయీద్ మదానీ కృషి చేశాడు. దీంతో గూఢచర్యం ఆరోపణలతో గతేడాది అక్టోబర్‌లో ఆయనను ఇరాన్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. విచారణలేకుండానే డిసెంబర్‌లో మరణ శిక్ష విధించింది.కాగా, విదేశీ శక్తులు దేశవ్యాప్తంగా నిరసనలను ప్రేరేపిస్తున్నాయంటూ ఇరాన్ పాలకులు ఆరోపిస్తున్నారు.

## అసమర్థ వైసిపి ప్రభుత్వం : టిడిపి



పెదకూరపాడు:కార్మిక, కర్షక, పేద మహిళలను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని పెదకూరపాడు మండల తెలుగు మహిళ నేతలు విమర్శించారు. మండలం లోని పాటిబండ్లలో మాటామంతి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయన్నారు. రాష్ట్రం లో మహిళలపై జరుగుతున్న వేధింపులను ఆపలేని అస మర్థ వైసిపి ప్రభుత్వమని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్. కృష్ణకుమారి,షేక్ ముంతాజ్, ఎన్.ఈశ్వరి, పి.శివమ్మ, కె.సుజాత, కె.పద్మలత, జి.పుష్పలత, పాటి బండ్ల నాయకులు బాలిరెడ్డి, సుభాని,సిరాజ్ పాల్గొన్నారు.

మాదిపాడులో...

మండలంలోని మాదిపాడులో శనివారం తెలుగు దేశం పార్టీ మాటా-మంతి కార్యక్రమాన్ని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లా అనుపకళ ప్రారం భించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుం టున్న వైసిపి ప్రభుత్వం, నిత్యావసర ధరలు పెంచిందని, విద్యు త్ బిల్లులతో ప్రజలను దోచుకుంటున్నారో మహిళలకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. మాదిపాడు టౌన్ టిడిపి అధ్యక్షురాలు వెంకటరమణ, ప్రచారకర్త ఆర్.వెంకట రమణ, అచ్చంపేట కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 20 ఫిర్యాదులు



గుంటూరు : వివిధ శాఖల ఉద్యోగుల నుండి అందిన ఫిర్యాదులను సంబంధిత కార్యాలయాలకు పంపుతామని, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమంలో నిర్వహించారు. ఉద్యోగుల నుండి ఫిర్యాదులను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డిఆర్ఓ కె.చంద్రశేఖరరావుతో కలసి ఉద్యోగుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 20 మంది ప్రభుత్వ ఉద్యోగుల నుండి ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించి ప్రతి కార్యాలయంలో రిజిష్టర్‌ను నిర్వహించాలని కోరారు. పరిష్కరించిన ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు కలక్టరేట్‌కు నివేదించాల్సి ఉంటుందన్నారు. అందిన ఫిర్యాదులు ఉన్నతాధికారుల పరిధిలో వుంటే ఆ మేరకు జిల్లా అధికారులు వారి ఉన్నతాధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్ట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, డిఇఓ శైలజ, డిఎస్ఓ పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి మనోరంజని, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, డిపిఒ కేశవరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అఖిలపక్షం ఆధ్వర్యంలో జీవో 1 ప్రతుల దహనం



- వినుకొండ : రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ప్రజాస్వామ్యానికి పాతరేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో 1ని జారీ చేశారని అఖిల పక్ష నాయకులు మండిపడ్డారు. జీవో ప్రతులను స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో దహనం చేశారు. తొలుత సిపిఐ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించి జీవోను రద్దు చేసేదాకా పోరాడాలని నిర్ణయించారు. సమావేశానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి వీల్లేదంటూ బ్రిటీష్ కాలం నాటి 1861 పోలీస్ యాక్ట్ ఆధారంగా జీవోను తేవడం, దీన్ని అన్ని రాజకీయ పార్టీలు పాటించాలనడం దుర్మార్గమన్నారు. జీవించే హక్కుతోపాటు భావ ప్రకటన స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటాయని, వీటిని కాదనడానికి ప్రభుత్వానికి అధికారం లేదని అన్నారు. ఈ జీవోను రద్దు చేయకుంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.నాగేశ్వరరావు, పీవీ సురేష్, సిపిఎం నాయకులు బి.వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు ఎన్.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఆర్‌కె నాయుడు, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు యు.రాము, సురేష్‌రాజా, లాల్‌ఖాన్, చిన్న, పవన్ కుమార్ పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ఎం హై స్కూల్ ముందు విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ, పేరెంట్స్ కమిటీ ధర్నా

తెనాలి : స్థానిక ఐతానగర్లోని ఎన్ ఎస్ ఎస్ ఎం హై స్కూలు ముందు పాఠశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, పేరెంట్స్ కమిటీ ధర్నా చేపట్టింది. పాఠశాలలో క్రాఫ్ట్ ఉపాధ్యాయిని విధుల్లో అలసత్వం వహిస్తున్నారని, ఆమెకు హిందీ ఉపాధ్యాయిని సహకరిస్తున్నారని, క్రాఫ్ట్ ఉపాధ్యాయినిని విధుల నుంచి తొలగించాలని, హిందీ ఉపాధ్యాయినిని బదిలీ చేయాలని గత రెండు రోజుల క్రితం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేసిన సంగతి విధితమే. అయితే క్రాఫ్ట్ ఉపాధ్యాయినిని జిల్లా విద్యాధికారికి సరెండర్ చేయడాన్ని ఆందోళనకారులు స్వాగతించినా, హిందీ ఉపాధ్యాయిని బదిలీపై అస్పష్టత నెలకొనడంతో తిరిగి పాఠశాల ముందు శనివారం ఆందోళన చేపట్టారు. జిల్లా విద్యాధికారి పాఠశాలను




తనిఖీ చేయాలని తక్షణమే హిందీ ఉపాధ్యాయినిని పాఠశాల నుంచి బదిలీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ వివరణ కోరగా క్రాఫ్ట్ ఉపాధ్యాయినిని జిల్లా విద్యాధికారి కార్యాలయానికి సరెండర్ చేశామన్నారు. హిందీ ఉపాధ్యాయిని బదిలీ, పాఠశాలలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి నివేదిక పంపాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ఆందోళన కారులు మరోసారి ధర్నా చేపట్టినట్టు వెల్లడించారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వారి చొరవతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వాస్తవానికి రెండు రోజుల క్రితం జరిగిన ఆందోళనలో భాగంగా హిందీ ఉపాధ్యాయినిని స్థానిక మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు బదిలీ చేసినట్లు ఎంఈవో వెల్లడించారు కూడా. అయితే దీనిపై లిఖితపూర్వకమైన ఆదేశాలు లేవు. పైగా హిందీ ఉపాధ్యాయిని విద్యాశాఖ మంత్రిని ఆశ్రయించినట్లు సమాచారం. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై పరిష్కారం ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే. ఆందోళనలో వార్డు కౌన్సిలర్ గెడ్డటి సురేంద్ర పేరెంట్స్ కమిటీ బృందం ,ఎమ్మార్పీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



శ్రియ శరన్ టెంప్టింగ్ ఫోజుల వైరల్ సెన్సేషన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. సినిమాలతో సంబంధం లేకుండా నెటిజనుల్లో..అభిమానుల్లోనూ నిరంతరం హాట్ టాపిక్ గా మారడం బ్యూటీ ప్రత్యేకత. ట్రెండీ ఫోటోలను షేర్ చేస్తూ క్రేజీ భామగా యువత గుండెల్లో నిలుస్తుంది. అగ్ర హీరోయిన్ గా రాణిస్తోన్న సమయంలో ఎలాంటి హవా సాగించిందో ఇప్పటికీ బోయ్స్ లో అదే ఫాలోయింగ్ ని మెయింటెన్ చేస్తుంది. ఏ ఇతర నాయికకు సాధ్యం కానిది శ్రీయకు మాత్రమే ఇది సాధ్యమైనది.పెళ్లైనా..ఓ బిడ్డకు తల్లైనా నెట్టింట్లో హాట్ హాట్ అందాల ఆరబోత ఎప్పుడూ చర్చే. మ్యాగజైన్ల కవర్ పైనా శ్రియ మెరుపులు తప్పనిసరి. తన పంచ్ వపర్ ఎక్కడైనా సందర్భాన్ని బట్టి ఉండాల్సిందేనని చెలరేగుతుంది. ఎలివేషన్ విషయంలో ఎంత ప్రాధాన్యత ఇస్తుందో? అంతకు మించిన ప్రాముఖ్యత ఫ్యాషన్ ఎంపికల్లోనూ ప్రముఖంగా

# శ్రియ సూపర్ హాట్ ట్రీట్!

చర్చకొస్తుంది.డిజైనర్ దుస్తుల్లో వావ్ అనిపిస్తుంది. తాజాగా అమ్మడు ఓ కవర్ పేజీ కోసం అందంగా..ఆకర్షణీయంగా ముస్తాబైంది. లెహంగా డిజైన్ లో అందాలతో యువత హృదయాల్లో అగ్గిరాజేస్తుంది. ఈ డిజైన్ లో టాప్ టూ బాటమ్ అమ్మడి స్కిన్ షో హైలైట్.వివిధ భంగిమల్లో కెమెరాకి ఇచ్చిన ఫోజులు అంతకు మించి హైలైట్ అవుతున్నాయి. శ్రియ అందం డేబై డే పెరుగుతోంది తప్ప! ఇసుమొత్తు కూడా మార్పులేదు. వయసుతో పాటు బ్యూటీని ఎలా మెయింటెన్ చేస్తుందో ఎకెండ్ ఇన్నింగ్స్ లో ఎలాంటి పరిమితులు లేకుండా ముందుకు సాగుతుంది. వచ్చిన ఏ అవకాశాన్ని విడిచి పెట్టడం లేదు. హీరోయిన్ గానే నటించాలి అన్న నిబంధన వదిలేసి వృత్తిలో ముందుకు సాగుతుంది.

# టాలీవుడ్‌లోకి ఐశ్వర్య అర్జున్



రంగం ఏదైనా వారసులు ఇచ్చే ఎంట్రీకి ఆదరణ మాత్రమే కాదు.. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నది తెలిసిందే. రాజకీయ.. సినీ రంగాల వరకూ వస్తే.. తమ.. తమ వారసుల్ని బరిలోకి దింపేందుకు చేసే ప్రయత్నాలు అన్ని ఇన్ని కావు. ముఖ్యంగా సినిమా రంగంలో ఒక హీరో తన కొడుకును తన వారసుడిగా ఎంట్రీ ఇచ్చేందుకు తన సర్వశక్తుల్ని ఒడ్డటం చూస్తు న్నదే. తమ వార సుల్ని హీరోలుగా పరిచయం చేసే విష యంలో అగ్ర నటులు పడే తపన అంతా ఇంతా కాదు. హీరోలుగా తమ వారసుల్ని దింపే అగ్రనటులు.. తమ కుటుంబం లోని అమ్మాం ఇల్ని వెండి తెరకు పరిచయం చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపని వైనం తెలిసిందే. ఇందుకు తగ్గట్లే.. తమ నట వారసుల్ని పరిచయం చేసే నటులు తమ ఇంట్లోని అమ్మాయిల్ని మాత్రం సినిమాల్లో యాక్ట్ చేయటానికి ఏ మాత్రం సంకోచించరు. కానీ.. తమ కుమార్తెల్ని తీసుకొచ్చే విషయంలో మాత్రం అగ్రనటులు ఎవరూ రెడీగా ఉండరు. ఈ తీరుకు కాస్త మినహాయింపు గా మంచు వారింటి నుంచి లక్ష్మీ.. మెగా కుటుంబం నుంచి నిహారికలు వచ్చినా.. వారు తమదైన ముద్రను ప్రేక్షకుల మీద వేయలేకపోయారనే చెప్పాలి. ఇదిలా ఉంటే.. తాజాగా యాక్షన్ కింగ్ అర్జున్ తన కుమార్తె ను టాలీవుడ్ కు పరిచయం చేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే తమిళ చిత్ర పరిశ్రమ లో ఎంట్రీ ఇచ్చినప్పటికి అక్కడ పెద్దగా సక్సెస్ కాలేదు. హీరోయిన్ ఛార్మ్‌కు ఏ మాత్రం తీసిపోని రీతిలో మెరిసే అర్జున్ కుమార్తె ఐశ్వర్య ఇప్పటికే తమిళ.. కన్నడ చిత్రాల్లో నటించారు. తమిళంతో పోలిస్తే కన్నడలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న ఐశ్వర్య అర్జున్ తాజాగా తెలుగు సినిమాకు చేయనున్నట్లు చెబుతున్నారు.

# సమంత సీన్లోకి వస్తే 'ఖుషీ' లాక్ అయినట్లే!



సమంత సీన్లోకి వస్తే 'ఖుషీ' రిలీజ్ డేట్ లాక్ చేయోచ్చా? సమంత కారణంగానే డిలే జరుగుతోందా? అమ్మడిపై కీలకమైన సన్నివేశాలు పెండింగ్ పడటంతో అంతకంతకు ఆలస్యమవుతోందా? అంటే అవుననే వినిపిస్తుంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఖుషీ' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే.ఇందులో హీరోయిన్ గా సమంత నటిస్తోంది. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. అన్ని అనుకున్నట్లు గనుక పక్కాగా షెడ్యూల్ ప్రకారం జరిగితే 'ఖుషీ' కూడా సంక్రాంతి బరిలో నిలిచేది. కానీ సమీకరణాలు మారడంతో సాధ్యపడలేదు. సమంత మయోసైటిస్ వ్యాధి బారిన పడటంతో ఖుషీ సినిమా షూటింగ్ అర్ధంతరంగా నిలిచిపోయింది.షూట్ అంతా పూర్తి చేసింది యూనిట్. కానీ సమంత పై చిత్రీకరించిన సన్నివేశాలు మాత్రం అలాగే నిలిచిపోయాయి. సామ్ పై షూట్ కి రెడీ అవుతోన్న సమయంలో ఆమె జబ్బు బారిన పడటంతో సమంతతో పాటు సినిమా యూనిట్ కూడా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. సమంత ఇతర సినిమా షూట్లతో పాటు ఖుషీ కి డేట్లు కేటాయించింది.వాటిని పూర్తి చేసినా 'ఖుషీ' టెర్మ్ వచ్చే సరికి ఆటంకంగా మారింది. ఇప్పుడు సమంత మళ్లీ మ్యాకప్ వేసుకుని సెట్స్ కి వస్తే తప్ప! ఖుషీ ముందుకెళ్లలేని పరిస్థితి. దీంతో దర్శకుడు కొన్ని రోజులుగా సామ్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూడటం తప్పచేసేదేం లేదు. తాజా సమాచారం ప్రకారం సంక్రాంతి తర్వాత సామ్ షూట్కి హాజరవుతుందని ప్రచారం సాగుతుంది.



నందమూరి కళ్యాణ్ రామ్ నటించిన విజయదశమి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు వేదిక హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఆ సినిమా నిరాశ పర్చినా కూడా ఆఫర్లు మాత్రం కంటిన్యూగా వచ్చాయి. తెలుగు సినిమాల్లోనే కాకుండా కన్నడం.. మలయాళం మరియు తమిళ చిత్రాల్లో నటించింది. అప్పుడప్పుడు ఈ అమ్మడు హిందీలో కూడా మెరిసింది. తెలుగు లో ఈ అమ్మడు ప్రస్తుతం పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది కానీ తమిళం మరియు మలయాళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుంది.ప్రస్తుతం

## అందాల వేదిక నడుము నాభి అందం చూపు తిప్పనివ్వదే

ఈఅమ్మడిచేతిలో ఏకంగా అరడజను సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది వేదిక నటించిన సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.సినిమాలతో ఇంత బిజీగా ఉన్నా కూడా ఈ అమ్మడి యొక్క ఫొటో షూట్స్ సోషల్ మీడియాలో రెగ్యులర్ గా వైరల్ అవుతూనే ఉంటాయి.తాజాగా వేదిక షేర్ చేసిన ఈ ఫొటోలు నెటిజన్స్ ను చూపు తిప్పుకోవడం లేదు. మరీ ఇంత అందంగా ఉంటే ఎలా అమ్మడు అంటూ చిలిపిగా వేదిక ను తిడుతున్నట్లుగా ఆమె ఫొటోలకు కామెంట్స్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 సంవత్సరాలకు పైగానే అయ్యింది.. వయసు నాలుగు పదులకు చేరువ అయ్యి ఉంటుంది. అయినా

# ఫ్యాషన్ కా బాప్.. బుట్టబొమ్మ వ్వాటే లుక్?



%ప్రతిసారీ ఫ్యాషన్ గేమ్ తో ఎలా మెరుపులు మెరిపించాలో బుట్టబొమ్మ పూజా హెగ్డేకి తెలిసినంతగా వేరొకరికి తెలియదేమో! బాలీవుడ్ లో నేటితరం నటవారసురాళ్ల కాంపిటీషన్ నడుమ పూజా తన ఉనికిని చాటుకునేందుకు నిరంతరం సరికొత్త యూనిక్ స్టైల్ ని అనుకరిస్తోంది. ముఖ్యంగా డిజైనర్ దుస్తుల ఎంపికలో తనని కొట్టేవాళ్లే లేరు అని నిరూపి స్తోంది. టోన్డ్ ఫిజిక్ ..సన్నజాజి లుక్ కి తగ్గట్టుగానే పూజా తన ఫ్యాషన్ ఎంం కలను మేనేజ్ చేస్తో ంది.తాజాగా పూజా హెగ్డే షేర్ చేసిన ఓ ఎ.ౌ టో ష ూ ట్ అంతర్జాలంలో దుమా రంగా మారింది. పూజా బ్లాక్ అండ్ బ్లాక్ లుక్ లో కనిపిం చింది. పైగా డార్క్ ఫ్రాక్ కి సరితూగే నల్ల కళ్లద్దాలతో అల్ట్రా పోష్ లుక్ లో మెరుపులు మెరిపించింది. పూజా ట్రెండీ ఫ్రాక్ లో టూ గ్లామరస్ గా కనిపిస్తోంది.పూజా హెగ్డే స్వగతంలోకి వెళితే.. తెలుగు-తమిళం- హిందీ పరిశ్రమల్లో పాపులర్ కథానాయిక. ఆరంభం మోడల్ గా తన వృత్తిని ప్రారంభించింది. 2010 లో ఐ యామ్ షీ-మిస్ యూనివర్స్ ఇండియా పోటీలో రెండవ రన్నరప్ గా కిరీటాన్ని పొందింది. జీవా సరసన తమిళ చిత్రం %--%ముగమూడి%--%తో నటనారంగేట్రం చేసింది. నాగచైతన్యతో %--%ఒక లైలా కోసం%--%లో మొదటి తెలుగు చిత్రం. అఖిల్ సరసనా మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ లోను నటించిన పూజా మహేష్- ఎన్టీఆర్ - చరణ్ - ప్రభాస్ తదితర అగ్ర హీరోల సరసన నటించింది. అల వైకుంఠపురములో చిత్రంతో బుట్టబొమ్మగా తెలుగు వారి గుండెల్లో కొలువుంది. తెలుగు చిత్రసీమలో ఎదురేలేని కథానాయికగా హవా సాగిస్తోంది.గ్లామర్ తో పాటు నట ప్రతిభతోను ఆకట్టుకుంటున్న పూజా ఒక్కో సినిమాకి రూ.3-4 కోట్ల పారితోషికం అందుకుంటోంది. తనను ప్రస్తుతం ఇన్ స్టాగ్రామ్ లో 22.1 మిలియన్ల (2.21 కోట్ల) మంది ఫాలోవర్స్ అనుసరిస్తున్నారు. ప్రతిసారీ సూపర్ స్టైలిష్ లుక్ తో అభిమానులను ఆశ్చర్యపరచడంలో ఈ బ్యూటీ ఎప్పుడూ విఫలం కాలేదు. ప్రస్తుతం త్రివిక్రమ్ - మహేష్ కాంబినేషన్ మూవీలో పూజా నటిస్తున్న సంగతి తెలిసిందే. సల్మాన్ సరసన బాలీవుడ్ లో భారీ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చిత్రంలో నటిస్తోంది.

# మాళవికతో డార్లింగ్ రొమాన్స్ మొదలైందా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో 'రాజా డీలక్స్' అనధికారిక టైటిల్ తో ఓ సినిమా తెరకెక్కు తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొద్ది భాగం షూటింగ్ కూడా పూర్తి చేసారు. ఆ షూట్ లో ప్రభాస్ సహా కీలక నటులంతా పాల్గొన్నారు. ఇటీవల వరుసగా కొన్ని రోజుల పాటు డార్లింగ్ ఏకంగా మారుతి సినిమా షూట్ లోనే నిరవధికంగా పాల్గొంటున్నారు.ప్రభాస్ ఇచ్చిన డేట్లలో షూట్ మొత్తం పూర్తి చేయాలని ఆదేశాలివ్వడంతో మారుతి వాటిని చకచకా పూర్తి చేసే పనిలో పడ్డారు. డార్లింగ్ సహా కథ డిమాండ్ చేయడంతో సినిమాలో ఏకంగా ముగ్గురు హీరోయిన్లు కూడా నటిస్తున్నసంగతి తెలిసిందే. తాజాగా మారుతి కొత్త షెడ్యూల్ కి రెడీ అవుతున్నారు. ఈ షెడ్యూల్ లో ప్రభాస్..మాళవికమోహనన్ మధ్య కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారని సమాచారం.సినిమాలో ఈ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది. మారుతి శైలి కామెడీ..ప్రభాస్ తరహా ఫన్ తో కూడిన సన్నివేశాలని సమాచారం.ఆ ఫన్ లోనే మాళవికతో రొమాంటిక్ సన్నివేశాలకు తావిచ్చినట్లు తెలుస్తుంది. మాళవికకి తెలుగు డెబ్యూ ఈ సినిమా. దీంతో షూట్ లో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంతో ఉంది.తొలి సినిమాలోనే ఏకంగా ప్రభాస్ తోనే నటించే అవకాశం రావడంతో అమ్మడి ఆనందానికి అవధుల్లేవ్. సినిమాలో ఈ బ్యూటీ లీడ్ ఎలాంటిదన్నది తెలియాలి. ఇదే సినిమాలో మరో ఇద్దరు హీరోయిన్లు కూడా నటిస్తున్నారు. ఈనేపథ్యంలో ముగ్గురిలో ఎవరిది మెయిన్ లీడ్ అన్నది క్లారిటీ లేదు.ప్రభాస్ కి మరో జోడీగా నిధి అగర్వాల్ ఏమాత్రం

Ownedy by EDITOR and Publisher: PREMNATH THOKALA, 26/152, Buttaipet,Machilipatnam, krishna Dist., Printed at Sri Lakshmi ofset
Printer binders, D. no : 32- 26- 126/ 13, opp BSNk Bgavan, chuttagunta, Vijayawada-4 Ph : 08672227347.. cell 9848667347- RNi NO :APTEL/2015/65279